సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం। 8। జనవరి। 2024




భీమవరానికి తాగునీటి ప్రాజెక్టు

భీమవరం పట్టణంలో పుష్కలంగా తాగునీరు అందించేందుకు కొత్త తాగునీటి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. 8లో



ముమ్మరంగా వర్జీనియా సాగు

ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో వర్జీనియా పొగాకు సాగు ముమ్మరంగా సాగుతుంది. పలు ప్రాంతాల్లో క్యూరింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



వైఎస్సార్ సీపీలో చేరికలు

ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరడంతో ప్రతిపక్ష పార్టీల వారు సైతం వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని మంత్రి కారుమూరి అన్నారు. 8లో

కొత్త రేషన్ కార్డులొచ్చాయ్

ప్రజల చెంతకే సంక్షేమం

- జిల్లాలో 4,935 కార్డుల మంజూరు
- ఈనెల నుంచే రేషన్ సరుకుల పంపిణీ
- 5,70,916కు పెరిగిన కార్డులు
- సర్వత్రా హర్షాతిరేకాలు



సాక్షి, భీమవరం: క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన వారందరికీ ఎప్పటికప్పుడు తెల్లరేషన్ కార్డుల మంజూరుచేయడం ద్వారా ఇంటింటా సంక్షేమ కాంతులు నింపుతోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. తాజాగా జిల్లాలో 4,935 రేషన్‌కార్డులు మంజూరు కాగా మొత్తం తెల్లరేషన్ కార్డుల (బియ్యం కార్డులు) సంఖ్య 5,70,956 చేరింది. ఈనెల నుంచే కొత్త కార్డుదారులకు ప్రభుత్వం రేషన్ సరుకులు పంపిణీ ప్రారంభించడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దారిద్ర్య రేఖకు దిగువన ఉండే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో తెల్లరేషన్ కార్డులదే ప్రధానపాత్ర. గత టీడీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు కోత పెట్టేందుకు అరకొరగా రేషన్ కార్డులు మంజూరు చేసింది. దీంతో కొత్త కార్డుల కోసం పేదలు అప్పటి జన్మభూమి కమిటీలు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్ సర్కారు రేషన్‌కార్డుల మంజూరుకు నిబంధనలను సరళతరం చేసింది. కుటుంబంలో ఎవరైనా ఉద్యోగి ఉంటే వారి వల్ల తల్లిదండ్రులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్న ఉద్దేశంతో కార్డు నుంచి వారిని తొలగించే వీలు కల్పించింది. కొత్తగా పెళ్లయిన వారుంటే స్ప్లిట్టింగ్ ద్వారా కార్డుల మంజూరుకు వెసులుబాటు ఇచ్చింది. ప్రతి ఆరు నెలలకు అర్హులైన వారికి కొత్త కార్డులు మంజూరు చేస్తుండటంతో జిల్లాలో కార్డుదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఉచితంగా బియ్యం

పునర్విభజన అనంతరం జిల్లాలో 5,53,519 రేషన్ కార్డులు ఉండగా గతేడాది జనవరిలో 3,090, జూలైలో 9,372 కొత్త కార్డులు మంజూరయ్యాయి. తాజాగా ఈనెలలో 4,935 కార్డుల మంజూరు చేయడంతో జిల్లాలో కార్డుదారుల సంఖ్య 5,70,916కు పెరిగింది. వీటిలో 31,944 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల బియ్యం ఉచితంగా, రూ.13.50కు కిలో పంచదార అందిస్తున్నారు. తెల్ల రేషన్‌కార్డుదారులకు రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అర కిలో పంచదార, రూ.16కు కిలో గోధుమ పిండిలతో పాటు కుటుంబంలోని ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

ఇంటి వద్దకే సరఫరా

రేషన్ డిపోకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందిస్తోంది. తూకంలో కచ్చితత్వం, ఈపోస్ యంత్రాలకు జీపీఎస్ ట్రాకింగ్ అమర్చడంతో సరుకుల అక్రమ రవాణకు తెరదించింది. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలుంటే ప్రజలు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఎండీయూ వాహనాలపై 1967 టోల్‌ఫ్రీ నంబర్‌ను ముద్రించింది. ఎండీయూ వాహనాలు క్రమం తప్పకుండా నిర్దేశిత ప్రాంతాలకు వెళ్లేలా సెంట్రల్ కమాండ్ కంట్రోల్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుందని సివిల్ సప్లయీస్ అధికారులు చెబుతున్నారు.

వలంటీర్ సాయంతో త్వరితగతిన..



మా ఇద్దరు అమ్మాయిలకు వివాహాలు కావడం, వారు ఆదాయపు పన్ను పరిధిలో ఉండటంతో 8 నెలల క్రితం రేషన్ కార్డు రద్దయ్యింది. నేను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండానే వలంటీర్ సాయంతో కొత్త రేషన్ కార్డు పొందాను. కొత్త రేషన్ కార్డుతో పాటు ఈనెల రేషన్ సరుకులు కూడా ఇచ్చారు. అసలే వృద్ధాప్యం, ఆపై ఒంటరిగా ఉంటున్న నాకు రేషన్ సరుకులు అందడం ఆనందంగా ఉంది.

-కల్లేపల్లి పుష్పావతి, తేతలి, తణుకు మండలం

జిల్లాలో బియ్యం కార్డులు

మండలం	ప్రస్తుతం	కొత్తవి
ఆచంట	18,911	178
ఆకివీడు	22,261	194
అత్తిలి	22,401	177
భీమవరం	60,492	558
గణపవరం	20,678	176
ఇరగవరం	22,266	234
కాళ్ల	22,193	217
మొగల్తూరు	24,456	221
నరసాపురం	41,595	313
పాలకోడేరు	21,767	215
పాలకొల్లు	38,956	345
పెంటపాడు	23,352	177
పెనుగొండ	22,679	175
పెనుమంట్ర	18,997	174
పోడూరు	20,970	210
తాడేపల్లిగూడెం	55,623	395
తణుకు	43,382	389
ఉండి	21,161	174
వీరవాసరం	20,493	190
యలమంచిలి	23,348	223

పనులను వేగిరపర్చండి

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



ఏలూరు (మెట్రో): జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన ప్రజలకు ఉపయోగపడే పనులను తక్షణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం శాఖల అధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి గాను ఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టాల్సిన 604 రకాల పనులలో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి పంచాయతీరాజ్ మూడంచెల వ్యవస్థల్లో కార్యాచరణ ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. జెడ్పీ నుంచి నిధులు మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని, అలాగే నిధులు మంజూరై ఇంకా మొదలు పెట్టని పనులను సత్వరమే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అయితే నిధులు మంజూరై చేపట్టేందుకు అవరోధం ఉన్న పనులను రద్దు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎంపీపీ సత్యనారాయణ, ఈఈ రామస్వామి, పీఆర్ ఈఈలు రమాకాంతరావు, శ్రీనివాస్, రమణమూర్తి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మ ఆలయ 60వ వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఉత్సవాలను ఈనెల 13 నుంచి 28 రోజులపాటు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం దేవస్థానం వద్ద సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేవస్థానం, ఉత్సవ నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, అధికారుల సమన్వయంతో ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. భారీగా భక్తులు తరలివస్తారని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎస్పీకి సూచించారు. అన్నసమారాధన రోజు మరింత అప్రమత్తంగా పనిచేయాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లైటింగ్‌కు సంబంధించి విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆర్డీఓ ప్రత్యేక ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్డీఓ శ్రీనివాసుల రాజు, డీఎస్పీ బి.శ్రీనాథ్, దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, దేవస్థానం సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం అభినందనీయం



కళాకారుల ఆర్థిక సత్కారంలో పాల్గొన్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సన్మానం చేయడం ద్వారా కళాకారుడికి న్యాయం జరుగుతుందని, మంచి ఉద్దేశంతో బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు నిర్వహించే సేవలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలో ఆదివారం రాత్రి బుద్దాల ఆధ్వర్యంలో నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. కళాకారుల గీతాలాపన, సభ, సత్కార కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొట్టు మాట్లాడుతూ కళాకారులకు పుట్టినిల్లుగా బీవీఆర్ కేంద్రం ఉందని ప్రశంసనీయం. ఏ రంగంలో అయినా నిబద్ధత, చిత్తశుద్ధితో కృషిచేస్తే కచ్చితంగా గుర్తింపు లభిస్తుందన్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్త మండలి ప్రత్యేక ఆహ్వానితులు, గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు చెన్న జనార్దనరావుకు గౌరవ పురస్కారం, పెదతాడేపల్లి గురుకులం ప్రిన్సిపాల్ భీమడోలు రాజారావు, ఉపాధ్యాయులు అల్లు శ్రీనివాసరావుకు ఉద్యోగ సేవా పురస్కారం, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న సన్నాయి వాయిద్య కళాకారుడు తీడ జగదీష్‌కు ఆర్థిక సత్కారం చేశారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ, మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, న్యాయవాది శిరిగినీడి విజయకృష్ణ, మానికొండ వెంకటేశ్వరరావు, కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు గరగ సమర్పణ



వెండి గరగను అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం మావుళ్లమ్మవారికి సినీ హీరో నందమూరి కళ్యాణ్‌రామ్ 3 కిలోల వెండి గరగను సమర్పించారు. ఆదివారం జగ్గన్నపేటకు చెందిన సిద్ధాంతి కారుపర్తి కోటేశ్వరరావు ఈ గరగను అమ్మవారి ఆలయంలో అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించారు. ఆలయానికి పూజా టికెట్లపై రూ.25,010, విరాళాల రూపంలో రూ.21,326, లడ్డూ విక్రయాల ద్వారా రూ.4,725, ఫొటోల అమ్మకంపై రూ.1,325 మొత్తంగా రూ.52,386 ఆదాయం సమకూరినట్టు దేవస్థానం ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

వలంటీర్ల సేవలు భేష్



అత్తిలి : కాకినాడులో సుబ్బలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ సునీత



నరసాపురం: హైదరాబాద్‌లో నాగయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సందీప్



ఆకివీడు : రాజమండ్రిలో చంద్రకాంతకు పింఛన్ అందిస్తున్న విజయ

నరసాపురం/అత్తిలి/ఆకివీడు: సేవాభావం, వృత్తిపై నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నారు గ్రామ, వార్డు వలంటీర్లు. అనారోగ్య సమస్యలతో దూర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందిస్తూ మన్ననలు పొందుతున్నారు. నరసాపురంలోని 27వ వార్డు వీవర్స్ కాలనీ ప్రాంతానికి చెందిన వలంటీర్ కవురు సందీప్ అదే వార్డుకు చెందిన జక్కంశెట్టి నాగయ్యకు హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందించాడు. నాగయ్య క్యాన్సర్‌తో అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన సందీప్ ఆయన వద్దకు వెళ్లి రూ.3 వేలు పెన్షన్ అందించాడు. సందీప్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అభినందించారు.

కాకినాడ వెళ్లి..

అత్తిలి మండలం మంచిలికి చెందిన మామిడిశెట్టి సుబ్బలక్ష్మి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు వలంటీర్ చదర్ల సునీత కాకినాడ వెళ్లి పింఛన్ అందించారు. అలాగే దంతుపల్లికి చెందిన కవురు సత్యనారాయణ అనారోగ్యంతో తణుకులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ వీరవల్లి సత్యవాణి తణుకు వెళ్లి ఆయనకు పింఛన్ అందజేశారు.

ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించి..

ఆకివీడు మండలం అయిభీమవరం గ్రామానికి చెందిన గాలి చంద్రకాంత రాజమండ్రిలో గుండె శస్త్రచికిత్స చేయించుకుని వైద్యం పొందుతున్నారు. అదే గ్రామానికి చెందిన వలంటీర్ గొర్ల విజయ ఆమె వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో చంద్రకాంతకు ఆపరేషన్ చేయించినట్టు వలంటీర్ విజయ తెలిపారు.

సీఎం జగన్ పాలనలోనే ప్రజలకు సంక్షేమం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో వృద్ధులకు పింఛన్లు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనతోనే ప్రజలకు సంక్షేమ రాజ్యం కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ ఈనెల నుంచి రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నారన్నారు. పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడంతో వృద్ధుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. సీఎం జగన్ హామీలను నెరవేర్చలేరని చెప్పిన ప్రతిపక్ష పార్టీల నాయకుల నోరు ఇప్పుడు పెగలడం లేదన్నారు. నవరత్నాలను ఇంత సమర్థవంతంగా అమలుచేయడాన్ని చూసిన చంద్రబాబుకు రాజకీయ జీవితం శూన్యంగా కనిపిస్తోందన్నారు. సీఎం జగన్ పాలనను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ల కోసం పడిగాపులు పడాల్సి వచ్చేదని, వృద్ధులు, దివ్యాంగులు ఒక చోటకు వచ్చి వేచి చూడాల్సి వచ్చేదన్నారు. అటువంటి సమయాల్లో వృద్ధులు స్పృహతప్పి పడిపోతే తోటి పింఛన్‌దారులు ఆస్పత్రికి తరలించిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. నేడు జగన్ పాలనలో ఇంటి వద్దకే పింఛన్లను ఠంచన్‌గా ఒకటో తారీఖునే అందిస్తున్నారన్నారు. తమకు శ్రమ కలగకుండా ఇంటి వద్దకే పింఛన్ సొమ్ములు అందించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నవరత్నాల సంక్షేమ పథకాలను అందించేందుకు వలంటీర్లు ఇంటికే వస్తున్నారన్నారు.

త్వరలో టిడ్కో ఇళ్ల పంపిణీ

నెలాఖరున మిగిలిన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తామని మంత్రి కొట్టు హామీ ఇచ్చారు. ఇప్పటివరకు తాడేపల్లిగూడెం పట్టణంలో 3,230 మందికి టిడ్కో గృహాలు అందించామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, కమిషనర్ శామ్యూల్, నాయకులు పసల కనకసుందరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, ముత్యాల ఆంజనేయులు, కర్రి భాస్కరరావు, బొడ్డు సాయిబాబా, మానికొండ వెంకటేశ్వరావు, వట్టి బుజ్జి, బోణం విజయనిర్మల, బొద్దాని శ్రీను, కొట్టు విశాల్, ఎంపీపీలు దాసరి హైమావతి, పానుకుమాటి శేషులత తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ బాలిక దత్తత



బాలికను దత్తత ఇస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో) : ఏలూరు శిశుగృహాలో పెరుగుతున్న 16 ఏళ్ల బాలిక సిరిని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సమక్షంలో ఆదివారం దత్తత ఇచ్చారు. కర్ణాటకకు చెందిన హరీష్, పుష్ప దంపతులకు దత్తత ఇచ్చామని, దత్తత తీసుకున్నవారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. వారిపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు. చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లలను కారా నిబంధనల మేరకు దత్తత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్యచక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్, శిశు గృహ మేనేజర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

నాడు.. సమస్యల వెం'బడి'



ఆకివీడు మండలం మందపాడు ప్రాథమిక పాఠశాలలో అధ్వానంగా మరుగుదొడ్లు



పాలకొల్లు బ్రాడీపేటలో సింగోడియన్ ప్రాథమిక పాఠశాల వద్ద వాన నీటిలో వెళుతున్న విద్యార్థులు

శిథిల భవనాలు.. అరకొర వసతులు.. వర్షం నీటితో నిండిన ప్రాంగణాలు.. విరిగిన బల్లలు.. వెలిచిపోయిన బ్లాక్‌బోర్డులు.. గాలి, వెలుతురు సరిగా లేని తరగతి గదులు.. ఇది గతంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి.. సమస్యలతో సహవాసం చేస్తూ సర్కారీ బడుల్లో పేద పిల్లల చదువులు సాగాయి.. అధ్వానంగా ఉన్న మరుగు దొడ్లతో విద్యార్థినులు అవస్థలు పడ్డారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు పిల్లలు ఆసక్తి చూపించేవారు కాదు. తప్పని పరిస్థితుల్లో పేదలు భారమైనా ప్రైవేట్ విద్యాసంస్థలకు తమ పిల్లలను చేర్పించేవారు.

-సాక్షి, భీమవరం

నేడు.. వసతులతో బాగు'బడి'



పాలకొల్లు బ్రాడీపేటలో సర్వాంగ సుందరంగా ముస్తాబైన సింగోడియన్ ప్రాథమిక పాఠశాల



మందపాడు ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు

సర్వాంగ సుందరంగా భవనాలు.. ఆహ్లాదకరంగా తరగతి గదులు.. పాఠశాల ప్రాంగణాలు.. గ్రీన్‌బోర్డులు.. డెస్కులు.. క్లాస్‌రూమ్‌లలో ఫ్యాన్లు, లైట్లు.. డిజిటల్ తరగతులు.. అధునాతన వసతులతో తాగునీరు, మరుగుదొడ్లు.. కార్పొరేట్ సంస్థలను తలదన్నేలా హంగులతో నేడు ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. దీంతో సర్కారీ బడుల్లో చదువుకునేందుకు పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేట్ సంస్థల్లో చదువుతున్న పిల్లలను సైతం మాన్పించి తల్లిదండ్రులు ఇక్కడ చేర్పిస్తున్నారు.

క్లుప్తంగా

అథ్లెటిక్స్ జాతీయ పోటీలకు ఎస్ఎన్‌వీఎం విద్యార్థి


అనంతపురం పోటీల్లో సాధించిన పతకాలతో క్రీడాకారుడు సాయివివేక్

తణుకు అర్బన్: ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో తణుకుకు చెందిన క్రీడాకారుడు సత్తాచాటాడు. ఈనెల 4, 5, 6 తేదీల్లో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 1500 మీటర్ల విభాగంలో తణుకు ఎస్ఎన్‌వీఎం పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన క్రీడాకారుడు వంటపాటి సాయివివేక్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడని కోచ్ కిలాడి వంశీకృష్ణ ఆదివారం చెప్పారు. ఈ పోటీల్లో చూపిన ప్రతిభతో ఫిబ్రవరిలో కర్ణాటకలో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాయివివేక్ ఎంపికైనట్లు వివరించారు.

వేడుకగా శ్రీవారికి ధనుర్మాస ఉత్సవం


తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు, గోదాదేవి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఉభయ దేవేరులు, గోదాదేవితో శ్రీవారు తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. అశ్వ, గజ సేవలతో జరిగిన ఈ ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. గ్రామోత్సవం అనంతరం ఆలయం వద్ద ఉన్న ధనుర్మాస మండపంలో శ్రీవారికి అర్చకులు విశేష పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

భీమవరానికి కొత్త తాగునీటి ప్రాజెక్టు

- అమృత్ పథకంలో రూ.36.50 కోట్లతో ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మాణం
- 10న ప్రారంభం
- మూడు రిజర్వాయర్లు కూడా సిద్ధం
- ప్లాంట్ వేగవంతానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి కృషి


ప్రధాన రక్షిత మంచినీటి విభాగం ట్యాంక్


నిర్మాణం పూర్తయిన దుర్గాపురం వాటర్ రిజర్వాయర్

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరానికి పుష్కలంగా తాగునీరు అందించడంతోపాటు భవిష్యత్ జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ ఫేజ్–2లో మంజూరు చేసిన కొత్త తాగునీటి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఈ నెల 10న ప్రాజెక్టు ప్రారంభించి అందుబాటులోకి తీసుకువరావడానికి ప్రజారోగ్య విభాగం (ప్లబిక్ హెల్త్) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్లాంట్ అందుబాటులోకి రావడంతో భీమవరం పట్టణ ప్రజలకు రెండు పూటల ఫిల్టర్ నీళ్లు లభిస్తాయి. భీమవరం చివరి ప్రాంతాలకు, టిడ్కో ఇళ్లకు తాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తారు. 2033 నాటికి భీమవరం పట్టణంలో పెరుగున్న జనాభాను అంచనా వేసి భవిష్యత్‌లో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేలా అమృత్ పథకంలో వాటర్ ప్లాంట్, రిజర్వాయర్‌లు నిర్మించారు. భీమవరం పైపుల చెరువు రోడ్డులో హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద ఈ ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మించారు.

రూ.36.54 కోట్లతో ప్లాంట్ నిర్మాణం

అమృత్ పథకంలో రూ.36.54 కోట్లతో రోజుకు 1.70 కోట్ల లీటర్లను ఫిల్టర్ చేసి సరఫరా చేసే ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్లాంట్‌లో నీటిశుద్ధికి సంబంధించి ఏరియటర్, క్లారిఫ్ ప్లాక్యులేటర్, కెమికల్ హౌస్, ఫిల్టర్ హౌస్, ఫ్లాష్ మిక్సర్ తదితర విభాగాలు ఉంటాయి.

రూ.6.80 కోట్లతో మూడు రిజర్వాయర్లు

ఫిల్టర్ ప్లాంట్ నుంచి వచ్చే శుద్ధి చేసిన నీరు నిల్వ చేసి సరఫరా చేయడానికి ఈ పథకంలో రూ.6.80 కోట్లతో పట్టణంలో మూడు రిజర్వాయర్ల (వాటర్ ట్యాంకులు) నిర్మించారు. అందులో దుర్గాపురంలో రూ.2.15 కోట్లతో 10 లక్షల లీటర్లు సామర్థ్యంతో నిర్మించారు. ఈ రిజర్వాయర్ ద్వారా అరేటి నగర్, ఎం.ఆర్.నగర్, ఆటో నగర్, దుర్గాపురం, డీమార్ట్ ఏరియా, శివరావుపేట ప్రాంతాలకు పుష్కలంగా నీళ్లు సరఫరా చేస్తారు. బీసీ కాలనీలో రూ.2.15 కోట్లతో 10 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్ ద్వారా రామలక్ష్మణ్ నగర్, ప్రకాష్ నగర్, టెలిఫోను కాలనీ, బీసీ కాలనీ ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తారు. ఏఆర్‌కేఆర్ 4 వార్డులో రూ 2.50 కోట్లతో 12 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించారు. ఈ రిజర్వాయర్ ద్వారా నర్సయ్య అగ్రహారం, మార్కెట్ యార్డ్ తదితర ప్రాంతాలకు తాగునీరు అందిస్తారు.

ప్రాజెక్టు పూర్తికి కృషి చేసిన విప్ గ్రంధి శ్రీనివాస్

గత ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన నడిచింది. గత ప్రభుత్వంలో నిర్మాణం చురుగ్గా సాగలేదు. గ్రంధి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా వచ్చిన నాటికి ఈ ప్రాజెక్టు నిర్మాణం 25 శాతంగా ఉంది. దీనిపై దృష్టిపెట్టిన ఎమ్మెల్యే ప్రాజెక్టు నిర్మాణంపై నిరంతరం అధికారులతో సమీక్షించారు. పనులు వేగంగా పనులు పూర్తికావడానికి తన వంతు కృషి చేశారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ పథకానికి నిధులు మంజూరు చేస్తాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.9.44 కోట్లు నిధులు మంజూరు కాగా రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రూ.3.65 కోట్లు నిధులు మంజూరు చేసింది. పట్టణ పురపాలక విభాగం నుంచి రూ.23.45 కోట్ల నిధులు మంజూరు చేశారు. అమృత్ 2.0 లో భీమవరం పట్టణానికి రూ 47.29 కోట్లు ఇటీవల మంజూరు చేశారు. ఈ నిధులతో భీమవరం పట్టణంలో తాగునీటి సరఫరా పనులు, జగనన్న లేఅవుట్లలో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌లను తయారుచేసే పనిలో అధికారులు ఉన్నారు. డీపీఆర్‌లు పూర్తయిన వెంటనే టెండర్లు ఖరారు చేసి పనులు చేపట్టనున్నారు.

శుద్ధి చేసిన తాగునీరు సరఫరా



అమృత్ ఫేజ్–2లో రూ.36.50 కోట్లతో తాగునీటి శుద్ధి, సరఫరా పనులు చేపట్టాం. ఈ నెల 10వ తేదీన ఫిల్టరేషన్ ప్లాంట్‌ను ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభిస్తారు. తర్వాత మూడు రిజర్వాయర్లు ప్రారంభించి పట్టణ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందిస్తాం.

– ఆర్.విజయ్, డీఈ, పబ్లిక్ హెల్త్ విభాగం

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సందడి చేసిన ఐజీ


స్కూల్‌లో స్నేహితులకు సరదాగా హాజరువేస్తున్న ఏసీబీ ఐజీ రామకృష్ణ

కైకలూరు: కైకలూరులోని జిల్లా పరిషత్ ఓరియెంటల్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఏసీబీ ఐజీ పీహెచ్‌బీ రామకృష్ణ సందడి చేశారు. ఈ పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదివిన రామకృష్ణ చిన్ననాటి స్నేహితులతో కలిసి సరదాగా గడిపారు. అప్పటి విషయాలను, పాఠాలు చెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. స్నేహితుల కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తాను ఎంత స్థాయికి చేరినా గ్రామాన్ని, స్నేహితులను మరువనన్నారు. తొలుత పాఠశాల గదిలో బెంచీలపై స్నేహితులు కూర్చోగా, రామకృష్ణ వారికి హాజరు వేశారు. తరువాత స్నేహితులతో కలిసి సెల్ఫీలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు పెనుమూడి నాగరాజు, పురుషోత్తం, సురేష్, గురిజా, మాచిరెడ్డి శ్రీను, పార్వతీ, నాగ రాజశ్రీ, శ్యామలా, శ్రీను, సుబ్బారావు అప్పన్న, రాజబాబు, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కైకలూరు విచ్చేసిన ఐజీని కైకలూరు ఎంపీపీ ఎ.కృష్ణ, బొర్రా శ్యామ్‌సుందర్, రూరల్ సీఐ కృష్ణకుమార్ పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానం పలికారు.

కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరికలు


దాళ్లపాలెంలో మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన స్థానికులు

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరడంతో ప్రతిపక్ష పార్టీల వారు సైతం వైఎస్సార్ కుటుంబంలో చేరుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో పలువురు మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉంటే అందరికి మంచి జరుగుతుందనే నమ్మకం ప్రజలలో కలుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల కష్టాన్ని దోచేశారని, కానీ నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి రహితంగా సంక్షేమ పాలన అందుతోందన్నారు.

పొగాకు రైతులకు వడ్డీ లేని రుణాలు

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన పొగాకు రైతులకు పొగాకు బోర్డు సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు వడ్డీలేని రుణం మంజూరు చేయనున్నట్లు ఎస్ఎల్ఎస్ రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎల్ఎస్ పరిధిలోని అన్ని వేలం కేంద్రాలలో పంట దెబ్బతిన్న రైతులు ఇందుకు అర్హులన్నారు. జాబితాలో పేరున్న, పొగాకు బోర్డు రైతు సంక్షేమ నిధిలో నమోదై ఉన్న రైతులు వేలం కేంద్రంలో రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

సన్నద్ధత ఉంటే విజయం వెంటే..

- గాడాలలో ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ సెమీ ఫైనల్స్
- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల విద్యార్థుల హాజరు
- పోటీ పరీక్షలకు ఉపయుక్తం అంటున్న తల్లిదండ్రులు


గాడాల లారల్ గ్లోబల్ హైస్కూల్‌లో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మధురపూడి: అవగాహన ఉంటే ఏ పరీక్షల్లోనైనా విజయం సాధించవచ్చు.. ముందస్తు సన్నద్ధతతో అసాధ్యాన్నైనా సుసాధ్యం చేయవచ్చు.. అచ్చం అలానే ఇంగ్లిష్ అంటే భయం పోగొట్టి, ఆ భాషపై పట్టు సాధించేందుకు, పోటీ పరీక్షల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు ×సాక్షి× మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ సెమీ ఫైనల్స్ ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. దీనికి కోరుకొండ మండలం గాడాలలోని లారల్ హై గ్లోబల్ స్కూల్ వేదికైంది. ఈ పరీక్షలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 20 విద్యా సంస్థలకు చెందిన 365 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి వెంట తల్లిదండ్రులూ వచ్చారు. నాలుగు కేటగిరీల్లో నిర్వహించిన 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగింది. కేటగిరి–1లో ఒకటి, రెండు తరగతులు, కేటగిరి–2లో 3, 4 తరగతులు, కేటగిరి–3లో 5, 6, 7 తరగతులు, కేటగిరి–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగిన ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ పరీక్షలు దోహదపడ్డాయని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్పెల్ బీ ద్వారా పోటీ పరీక్షలను దీటుగా ఎదుర్కోవడానికి అవగాహన ఏర్పడిందని అన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో నూతనోత్సాహం వచ్చిందని అభిప్రాయపడ్డారు. స్పెల్ బీ నిర్వహించిన ×సాక్షి× యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరీక్షలను లారల్ హైగ్లోబల్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ రవికుమార్ సుంకర, 'సాక్షి' రీజినల్ మేనేజర్ (అడ్మిన్) ఎస్.రమేష్‌రెడ్డి, 'సాక్షి' యాడ్స్ రీజినల్ మేనేజర్ కొండలరావు పర్యవేక్షించారు. లారల్ హైగ్లోబల్ స్కూల్ సహకారం అందించింది. దీనికి డ్యూక్స్ వ్యాపి ప్రెజెంటింగ్ స్పాన్సర్‌గా, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరించాయి.

గ్రామర్‌పై మరింత అవగాహన



ఈ పరీక్షలో పాల్గొనడం వల్ల అనేక అంశాలు తెలిశాయి. స్పెల్లింగ్స్, గ్రామర్‌పై మరింత అవగాహన వచ్చింది. ఈ పరీక్షలకు కొన్ని రోజులపాటు ప్రిపేర్ అయ్యాను. సెమీ ఫైనల్స్‌లో పాల్గొనడం సంతోషంగా ఉంది.

– పెమ్మరాజు ఆర్యశ్రీకృతి, ఒకటో తరగతి, ఇండియన్ పబ్లిక్ స్కూల్, రాజమహేంద్రవరం

విదేశీ విద్యకు ఉపయోగకరం



విదేశీ విద్యకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగకం. ఇంగ్లిష్ నేర్చుకోవడానికి దోహదపడుతోంది. వ్యాకరణంలో కొన్ని విషయాలు తెలుసుకున్నా. పరీక్ష రాయడం ద్వారా మంచి భవిష్యత్‌ను పొందడానికి బాటలు వేసుకుంటాను.

– బి.రాహుల్, 8వ తరగతి విద్యార్థి, ఆదిత్య స్కూల్, కాకినాడ

మంత్రి కొట్టుకు రైతుల సత్కారం



ఉపముఖ్యమంత్రి కొట్టును గజమాలతో సత్కరిస్తున్న రైతులు

తాడేపల్లిగూడెం అర్బన్: పంటల బీమా పరిహారం సొమ్ము మంజూరుకు కృషి చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆదివారం రైతులు గజమాలతో సత్కరించారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి కొట్టును ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. 2020 సార్వా పంటకు సంబంధించి పంటల బీమా సొమ్ము రైతులకు అందాల్సి ఉంది. రూ.లక్ష లోపు బీమా సొమ్ములు ఆ సమయంలోనే రైతులకు అందాయి. అయితే రూ.లక్షకు పైబడి ఉన్న బీమా సొమ్ములు రెండేళ్లుగా అందడం లేదు. దీంతో ఈ విషయాన్ని రైతులు మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా కొట్టు కృషితో 112 మంది రైతులకు రూ.1.98 కోట్ల సొమ్ము రైతుల బ్యాంక్ ఖాతాలకు రెండు రోజుల క్రితం జమయ్యాయి. దీంతో రైతులు మంత్రి కొట్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం



ఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న స్థానికులు, అంతరచిత్రంలో దెబ్బతిన్న విగ్రహం ముక్కు కళ్లు, చేతివేళ్లు

జంగారెడ్డిగూడెం: తాడువాయిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి పాక్షికంగా ధ్వంసం చేశా రు. విగ్రహం చేతి వేళ్లు, ముక్కు, కళ్లు దెబ్బ తిన్నాయి. ఈ దుశ్చర్యకు నిరసనగా స్థానిక ప్రజలు, అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం ఎస్సై మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. విగ్రహ ధ్వంసానికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్సైకి ఫిర్యాదును అందజేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముమ్మరంగా వర్జీనియా సాగు

- ఆశాజనకంగా పొగాకు తోటలు
- పలు చోట్ల ప్రారంభమైన క్యూరింగ్ పనులు


బుట్టాయగూడెం సమీపంలో వేసిన పొగాకు పంట

బుట్టాయగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో వర్జీనియా పొగాకు సాగు ముమ్మరంగా సాగుతుంది. ఈ ఏడాది రైతులు వేసిన పంటలు మిచాంగ్ తుపాను కారణంగా కొంతమేర దెబ్బతింది. అయినప్పటికీ రైతులు మళ్లీ పంటలను వేశారు. అక్టోబర్‌లో వేసిన తోటలు పలుచోట్ల పక్వానికి రావడంతో రైతులు ఆకులు రెలిచి క్యూరింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రస్తుతం పొగాకు పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రధానంగా వరి, మొక్కజొన్న, చెరుకు తర్వాత అత్యధికంగా వర్జీనియా పంటల్ని రైతులు పండిస్తున్నారు. గత రెండేళ్లుగా పొగాకు పంటకు ధర అధికంగా ఉండడంతో ఈ ఏడాది అనేక మంది రైతులు కౌలుకు తీసుకుని మరీ పొగాకు వేశారు. ఏజెన్సీ మెట్టప్రాంతాల్లో ఉత్తర తేలిక నేలలో(ఎన్ఎల్ఎస్) పొగాకు సాగు చేస్తున్నారు. ఇక్కడ పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. అమెరికా, రష్యా, జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాల్లో పండిస్తున్న పంటకు దీటుగా ఈ ప్రాంత రైతులు పొగాకు పండిస్తున్నారు. అక్టోబర్ నుంచి మార్చి వరకూ పొగాకు సీజన్.. పండించిన పొగాకును ఆకులు రెల్చి క్యూరింగ్ చేసి బేళ్లుగా కట్టి గ్రేడ్ చేసి వేలం కేంద్రాల్లో విక్రయిస్తారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకూ పొగాకు కొనుగోళ్లు జరుగుతాయి.

55 వేల ఎకరాల్లో వర్జీనియా సాగు

ఈ ఏడాది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో 49 మిలియన్ల కిలోల ఉత్పత్తికి కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. సుమారు 55 వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 68 మిలియన్ల కిలోల వరకూ ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలోని 14,097 మంది రైతులు 12,235 బ్యారన్‌లు రిజిస్ట్రేషన్ చేసుకుని పొగాకు సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రం పరిధిలో 2,877 మంది రైతులు 2,407 బ్యారన్‌లు రిజిస్ట్రేషన్ చేసుకుని సుమారు 4,490 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జంగారెడ్డిగూడెం–2లో 2,760 మంది రైతులు 2,608 బ్యారన్‌ల పరిధిలో సుమారు 4,335 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు. కొయ్యలగూడెంలో 2,892 మంది రైతులు 2,539 బ్యారన్‌ల పరిధిలో 4,443 హెక్టార్లలో పొగాకు సాగు చేస్తున్నారు.

ఆశాజనకంగా పంట



పలు గ్రామాల్లో ముందుగా వేసిన పొగాకు తోటల రెల్పులు, క్యూరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది 55 వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను తిరిగి వేశారు. తోటల ఎదుగుదల బాగుంది. పరిమితికి లోబడి పంట వేసి అధిక దిగుబడులు సాధిస్తే సాగు లాభసాటిగా ఉంటుంది.

ఎం.ఆదిశేషయ్య, పొగాకు బోర్డు ఆర్ఎం, రాజమండ్రి

గోదాదేవికి సారె సమర్పణ

పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవి అమ్మవారికి, ఆలయంలో ఉన్న దేవతామూర్తులకు సారె సమర్పణ వైభవంగా నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామివారు, అమ్మవార్లకు నూతన వస్త్రాలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించారు. సారెలో పండ్లు, గాజులు, నైవేద్యాలను భక్తులకు పంపిణీ చేశారు. – జంగారెడ్డిగూడెం


గోదాదేవికి సారెను తీసుకువెళుతున్న భక్తులు

క్లుప్తంగా

ఎఫ్‌సీఐ కాలనీలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎఫ్‌సీఐ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయాలను గుర్తు చేస్తూ పోటీ పడిన మహిళలు వేసిన ముగ్గులు ఆకర్షించాయి. ఈ సందర్భంగా విజేత మహిళలకు నగదు, ఇతర బహుమతులు అందజేశారు. కాలనీ అసోసియేషన్ ఎం.రంగారావు, కార్యదర్శి ఎం.జనార్దన్, గౌరవాధ్యక్షులు పి.నాగరాజు, కోశాధికారి పరమాత్మ, శానం లలిత, లక్ష్మి, పార్వతి, డాక్టర్ కంచర్ల సాయి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల వితరణ



అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అయోధ్య రాముని అక్షింతలను ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక నంది బొమ్మ సెంటర్ రామాలయం నుంచి ఊరేగింపుగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయా నాయకులు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్య రామాలయం ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు అక్షింతలు తలపై వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, సుంకవల్లి రామకృష్ణ, ముప్పిడి సురేష్ రెడ్డి, కోట రాంబాబు, కర్రి ప్రభాకర్ బాలాజీ, బోగిరెడ్డి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా తిరుప్పావై పారాయణం



కె. పెంటపాడు బైరాగి మఠంలో తిరుప్పావై పారాయణం చేస్తున్న దృశ్యం

పెంటపాడు: ధనుర్మాసం పురస్కరించుకుని ప్రతీనిత్యం ఉదయం 6 గంటల నుండి జరిగే తిరుప్పావై పఠనలో పాల్గొన్న అందరికీ ఆధ్యాత్మిక ముక్తి లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ మేకల చిరంజీవులు పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున ఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ధనుర్మాస పూజలు నిర్వహించారు. అనంతరం ఈఈ మేకల చిరంజీవులు సుమారు గంటపాటు స్వామివారి తిరుప్పావై పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు త్రిలోచన దాసు, పూర్ణచంద్రత్రిపాఠి పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం



పంజా వేమరంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: పంజా వేమవరంలో వేంచేసి ఉన్న పద్దల అంకమ్మ, దేవగిరి సత్తెమ్మ అమ్మవార్ల గ్రామోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మేళ తాళాలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక, సంప్రదాయ నృత్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. అమ్మవార్ల ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన పందిరిలో గ్రామస్తులు, గ్రామ ఆడపడుచులు బూరెలు, గారెలు అరటి పండ్ల దండలను వేలాడదీసి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం భక్తులకు వాటిని ప్రసాదంగా పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారని ఉత్సవ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

పెరిగిన పింఛన్‌తో జీవితానికి నిశ్చింత

ఉండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన పింఛన్లతో వృద్ధులు, వితంతువుల నిశ్చింతగా జీవించవచ్చని ఉణుదుర్రు సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీ అల్లూరి మాధవి అన్నారు. ఆదివారం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ రూ.3 వేలకు పెంచారని అన్నారు. పెంచిన పింఛన్ లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల లీగల్ సెల్ అధ్యక్షుడు జి.సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- అత్తిలి మండలంలో ముగిసిన ప్రజా దీవెన పాదయాత్ర



ఉరదాళ్లపాలెంలో పాదయాత్ర చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: నవరత్నాల పథకాలతో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి చేకూరిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం, వరిఘేడు గ్రామాల్లో 6వ రోజైన ఆదివారం ఆయన చేపట్టిన ప్రజా దీవెన పాదయాత్ర ముగిసింది. పాదయాత్రలో దారి పొడవునా మంత్రికి మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలకగా, వృద్ధులు తమ ఆశీస్సులు అందించారు. తామంతా మీ వెంటే ఉంటామని, తిరిగి జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మహిళలు మంత్రికి ముక్త కంఠంతో తెలిపారు. ప్రతి ఒక్కరిని మంత్రి పలకరిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎలా అందుతున్నాయి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలను ఓపిగ్గా విని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజా దీవెన పేరిట పాదయాత్ర ప్రారంభించానని, తాను చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కుల, మత, ప్రాంతాలను చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి, 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని, లేకపోతే మరలా ప్రజా ధనాన్ని దోచుకునే పాలకులు వస్తారని ఆయన తెలిపారు. తాను చేపట్టిన ప్రజా దీవెన పాదయాత్రలో ప్రజలందరూ కలిసికట్టుగా నాతో నడుస్తున్నారని, ప్రతి గడప గడపకూ ప్రజా స్పందన లభిస్తోందన్నారు. ఏ గడపకు వెళ్లినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందని చెబుతున్నారన్నారు. సీఎం జగన్ చేతికి ఎముకలేదని, నిరంతరం ప్రజల గురించి పరితపిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని, అన్నివర్గాల ప్రజలకు మేలు జరగడంతో ప్రజలంతా అండగా ఉన్నారని చెప్పారు. 2009లో తన హయాంలోనే రహదారులు, డ్రెయినేజీలు అభివృద్ధి చేశానని, టీడీపీ హయాంలో దోచుకో దాచుకో అనే విధంగా దోచుకున్నారే కానీ ఎటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. మరలా ఇప్పుడు తన హయాంలోనే అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్‌లు శింగంశెట్టి శ్రీనివాస్, పంపన సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు గుండుమోగుల శ్రీనివాసరావు, అనిశెట్టి త్రిమూర్తులు, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, ఉప సర్పంచ్ అడ్డాల రమేష్ నాయుడు, నాయకులు అడ్డాల వెంకటరత్నం బాబు, వినుకొండ వీరన్న కాపు, షేక్ మస్తాన్ సాహెబ్, రంభ సూరిబాబు, గారపాటి నాగరాజు, రామిశెట్టి రాము, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కోరుకొల్లు వెంకట్రావు, సబ్బితి రాజేష్, కంకటాల సతీష్, ఆకుల చినబాబు, బుంగా పద్మారావు, సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌కు శంకుస్థాపన

పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వేలైన్స్ కార్యక్రమంలో భాగంగా అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించే వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ ల్యాబ్ ద్వారా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, బుంగా పద్మారావు, వైద్యులు డాక్టర్ కె.నాగరాజు, ఆర్.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభం

గ్రామాల్లో ప్రజలు, రైతులకు అందుబాటులో సేవలు అందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం అత్తిలిమండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 20.08 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా ల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాల నుంచి పంట విక్రయం వరకు అన్ని సేవలు పొందవచ్చన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు గుండుమోగుల శ్రీనివాస్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైద్యులు డాక్టర్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థికాభివృద్ధి



ఇరగవరం: చుక్కావారితోటలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఇరగవరం మండలం రేలంగి శివారు గవర్లపాలెం, చుక్కావారితోట, బొబ్బరాజుపాలెంలో కారుమూరి ప్రజా దీవెన పాదయాత్ర ఆదివారం రాత్రి జరిగింది. స్థానిక ప్రజలు మంత్రి కారుమూరికి ఘన స్వాగతం పలికి హారుతులిచ్చారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రేలంగి గ్రామంలో రూ.146 కోట్లను సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించామన్నారు. తమ ప్రభుత్వంలో కుల, మత, పార్టీల కతీతంగా సంక్షేమ ఫలాలు అందాలన్న గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, దానికి నిదర్శనమే నేడు ఏ గడపకు వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీలు ఏకమై వచ్చినా వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. మీ కుటుంబానికి ఈ ప్రభుత్వం వల్ల లబ్ధి జరిగిందని భావిస్తేనే ఓటు వేయండని అని ధైర్యంగా చెప్పిన దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది ఒక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో దోచుకో దాచుకో అనే విధంగా దోచుకున్నారే కానీ ఎటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. ఈ సందర్భంగా చుక్కా వారితోటలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపిన అంజిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కె.దుర్గాప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, నాయకులు పులుపు అనిల్, పులుపు సునీల్, చేబ్రోలు పెద్దిరాజు, వడ్డి మార్కండేయులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి నాగేశ్వరరావు



ఉరదాళ్లపాలెంలో ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత కల్గిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం, వరిఘేడు గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు బటన్ నొక్కి మీ ఖాతాకే జమ చేస్తున్నారని, ఇటువంటి సంక్షేమ పాలన కొనసాగాలంటే తిరిగి మరలా వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కుల, మత పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో ఇతర పార్టీల వారు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్ల కృతజ్ఞతాభావంతో ఉన్నారని చెప్పారు. పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముసలి వరకు సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఇటీవల జగనన్న ఆరోగ్యసురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించి, మందులను అందజేశా రన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందిస్తున్న ఈ ప్రభుత్వానికి మీ ఆశీస్సులు అందజేయాలని కోరారు. ఉరదాళ్లపాలెం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో కోటిన్నర మాత్రమే సంక్షేమ, అభివృద్ధి పనులకు ఖర్చు చేసారని, మన ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ. 14.10 కోట్లు ఖర్చు చేశామని మంత్రి కారుమూరి వెల్లడించారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు విడుదల చేస్తే, ప్రతిపక్ష పార్టీలు కోర్టులో కేసు వేసి రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారని దుయ్యబట్టారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మీ ఇంటికి రెండు కండువాలు కప్పుకుని వస్తుంటారని, ఓటీపీ చెప్పవద్దని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల అనంతరం గ్రామంలో గల రోడ్లు, డ్రెయిన్ నిర్మాణపనులు తాను చేపడతానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, సర్పంచ్‌లు శింగంశెట్టి శ్రీనివాస్, పంపన సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు గుండుమోగుల శ్రీనివాసరావు, అనిశెట్టి త్రిమూర్తులు, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, పార్టీ తణుకు టౌన్, మండల అధ్యక్షుడు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు, అత్తిలి, తణుకు టౌన్ మహిళా విభాగం అధ్యక్షులు కాకర్ల విశాలాక్షి, నూకల కనకదుర్గ, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఉప సర్పంచ్‌లు అడ్డాల రమేష్ నాయుడు, మద్దాల శ్రీనివాస్, ఎంపీడీవో అమీలుజమా పాల్గొన్నారు.

ఎస్సీలను చంద్రబాబు పట్టించుకోలేదు



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఎస్సీలను చాలా దుర్మార్గంగా చూశాడని, ఎస్సీల మీద దాడులు జరిగితే పట్టించుకోలేదని, ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అని ఎస్సీలను కించపరిచాడని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆదివారం మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు అన్ని రంగాలలో పెద్ద పీట వేస్తూ గౌరవిస్తున్నారని కొనియాడారు. ఇలాం ముఖ్యమంత్రిని మళ్లీ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా దళితులు గెలిపించుకోవాలని కోరారు. ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరిస్తారని, రాష్ట్రంలోని దళిత బహుజనులందరూ విధిగా హాజరు కావాలని కోరారు. అంబేద్కర్ స్మృతివనంతో పాటుగా ఓపెన్ థియేటర్, మెడిటేషన్ హాల్, అంబేద్కర్ జీవిత విశేషాలు భావితరాలకు అందజేసే విధంగా చిత్రాలు, పుస్తకాలు సమకూర్చుతున్నారని, ఇంకెన్నో నిర్మాణాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సమావేశంలో నాయకులు బీర సునీల్, ఏసురత్నం, అనిల్ పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవల్లో భాగంగా 12 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు కొండాలమ్మ పుంత రోడ్డు, ఇరగవరం రోడ్డు కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు అక్కిన కాశీ విశ్వనాథం ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 5వ రోజుకు చేరింది. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. డి.సోమసుందర్, ఓసూరి వీర్రాజు, జయసుధ, చంద్రరావు, కాటమరాజు పాల్గొన్నారు.

రాములోరికి వెండి కిరీటం బహూకరణ



కోదండరామాలయంలో దాతలిచ్చిన వెండి కిరీటాన్ని స్వామివారికి అలంకరిస్తున్న అర్చకులు

ఆకివీడు: స్థానిక సంతపేటలోని కోదండ రామాలయంలో రాములోరికి, సీత, లక్ష్మణ, ఆంజనేయస్వామి వార్లకు వెండి కిరీటాన్ని ఆదివారం అలంకరించారు. స్థానికులు మంగిన కృష్ణ కుమారులు వీర వెంకటరావు వాణీ విజయ దంపతులు, సీతారామ ప్రభు ఆదిలక్ష్మీ దంపతులు రూ. లక్ష విలువైన నాలుగు వెండి కిరీటాలను ఆలయ చైర్మన్ కోమటి రాంబాబుకు అందజేశారు. తొలత మేళ తాళాలతో వెండి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామి వార్లకు అలంకరించారు.

అంగన్‌వాడీలు విధులకు హాజరుకావాలి

ఆకివీడు: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు ఈ నెల 8న విధులకు హాజరు కావాలని ఆకివీడు ప్రాజెక్టు అధికారిణి వాణీ విజయరత్నం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విధించిన గడువులోపు విధులకు హాజరుకాకపోతే అనంతరం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

ఘనంగా వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాకర్స్ భవనంలో ఆదివారం ఉదయం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా దూలం నాగరాజు, కార్యదర్శిగా చిప్పడ గురుమూర్తి, కోశాధికారిగా మల్లారెడ్డి కృష్ణార్జునరావు, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు కేవీ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు డాక్టర తానేటి శ్రీనివాస్, పూర్వ అధ్యక్షులు కేవీ చలం, జిల్లా గవర్నర్ వై.సత్యనారాయణ, కేవీ అనిల్ కుమార్, ఆదినారాయణ, బాకా వెంకటేశ్వరరావు, మాకా శ్రీనివాసరావు, పి.కుమారస్వామి, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా వాకర్స్ అధ్యక్షురాలిగా 8వ సారి వనచర్ల విజయలక్ష్మిని ఎంపిక చేశారు. కార్యదర్శిగా కుంట్ల కనకదుర్గ, కోశాధికారిగా సీహెచ్ ఇందిరాకుమారిలు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

క్రీడా సామగ్రి అందజేత



నీలాద్రిపురం సచివాలయం వద్ద క్రీడాకారులకు సామగ్రిని అందజేసిన సర్పంచ్ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం సచివాలయం వద్ద ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు ఆదివారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు మాట్లాడుతూ సచివాలయం, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో సత్తా చాటి తాడేపల్లిగూడేనికి మంచి పేరు తేవాలన్నారు. ప్రస్తుతం బిజీ జీవితంలో క్రీడలకు అవకాశం లేకుండాపోతుందన్నారు. విద్యతో పాటు క్రీడల వైపు గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. కాగా, కృష్ణాపురంలో జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు క్రీడా సామగ్రిని అందజేశారు. ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, సచివాలయ కార్యదర్శి టి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాపురంలో కొత్త పింఛన్లను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఇంటి బిడ్డగా ఆలోచించి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందజేస్తున్నారని, ఇచ్చిన హామీ మేరకు జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు ఆంజనేయులు మాట్లాడుతూ మండలానికి కొత్తగా 262 పింఛన్లు రాగా, ఒక్క కృష్ణాపురం గ్రామానికి 15 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నారమన్నారు. సీఎం జగన్ అందిస్తున్న పింఛన్‌తో కుటుంబ సభ్యుల మధ్య మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. పింఛన్‌దారులు తమ వ్యక్తిగత అవసరాలకు వేరే వారిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండాపోయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్‌ను, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, సచివాలయ కార్యదర్శి టి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో...

పెంటపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పెంచిన పింఛన్లతో పాటు నూతన పింఛన్లు గ్రామాల్లో పండుగ వాతావరణంలో అందిస్తున్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పింఛన్‌లను పంపిణీ చేశారు. తొలుత తాడేపల్లిగూడెంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమం ప్రారంభించగా అనంతరం ఆయా గ్రామాలలో ఈ సందర్భంగా పింఛన్‌లు పంపిణీ చేశారు. మండలం మొత్తం మీద 182 పింఛన్లు నూతన పింఛన్లు వచ్చినట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. ఆకుతీగపాడులో-8, అలంపురం-15, బి.కొండేపాడు-9, దర్శిపర్రు-8, జట్లపాలెం-9, కె.పెంటపాడు-15, కోరిమిల్లి-9, మీనవిల్లూరు-9, మౌంజీపాడు-10, పడమరవిప్పర్రు-11, పరిమెల్ల-4, పెంటపాడు-38, ప్రత్తిపాడు-14, రాచర్ల-8, రావిపాడు-10, వల్లూరుపల్లి-5 అందినట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. కాగా రావిపాడు గ్రామంలో సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు, ఆకుతీగపాడులో సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, కొండేపాడులో పార్టీ నాయకులు పాలా గణపతి, దేవరశెట్టి రాంబాబు, మద్రే కృష్ణమూర్తి, మీనవిల్లూరులో చింతపల్లి శ్రీనివాస్, మౌంజీపాడులో మైలవరపు పెదబాబు, పడమరవిప్పర్రు, పెంటపాడు, వల్లూరుపల్లి, అలంపురం గ్రామాలలో పార్టీ నాయకులు, పరిమెల్లలో సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, రాచర్లలో వాకా సుబ్బారావు, ప్రత్తిపాడులో వీర్ల గోవిందల ఆధ్వర్యంలో కొత్త పింఛన్‌లు పంపిణీ చేశారు.